శ్రీ వేగుంట మోహన ప్రసాద్

బతికిన క్షణాలు

భద్రాచలం వెళ్ళాలని రైలెక్కితే టికెట్ ప్రకారమైతే వెళ్ళలేం. సీతమ్మ వారున్న పర్ణశాల చేరుకోలేం. ఎండిన గోదావరి పక్క ఎముకల పక్క పడుకోలేం. భద్రాచలం 'రోడ్'కి కొయ్యాల్సిందే టికెట్.

దుర్గాపురం రోడ్ అని తెల్లాతెల్లారి ఎంతగా అరిచినా మన కేవన్నా తెలిసేడుస్తుందా?

'ట్రూ ప్లేసెస్ నెవర్ ఆర్' అన్లేదా మెల్విల్?

మాల్గుడీ మైసూరు కెంత దూరంలో ఉన్నదీ మైసూరు స్టేషన్ మాష్టారికే తెలీదుగా. జీవితపు రైళ్ళ స్టేషన్ పంతుళ్ళ మాటెప్పుడూ వినవు.

పక్క స్టేషన్ నుంచి మోగుతుంది పెట్టె టెలిఫోన్ కడుపులో గంట కొడ్తా.

వట్లూరు స్టేషన్ మాష్టారు పవర్ పేట స్టేషన్ మాష్టారితో అంటాడూ— "వొస్తున్నావ్రా దొంగ...." అనుకొంటూ "ఆ ఏవి ట్సార్ బండీ వొదిలీరా అలాగే" అని నూజివీడుని తిట్తాడు — "చంపుకు తింటున్నావురా దొంగ...." అని రిసీవర్ పెట్టేస్తో.

అలాగే ఉత్తరాలు రాస్తారు. కేబిల్స్ ఇస్తారు విదేశాంధ్ర డా. జి. కె. లండన్ నించి నాలుగు పౌండ్లు ఖర్చు పెట్టి. ఫ్రాన్సిస్ థామ్సన్ బొందెలో ఊపిరీ బొమికల్లో భాస్వరం ఏమైనా కొంచెమైనా ఉందేమోనని చూస్తారు. ఇన్ని చేసినా మనం మన నిద్రలోకీ అవజ్ఞలోకీ జారుకుపోతాం.

కొండ నిద్రపోతున్నపుడు తొలిచారు మన శిల్పులు మొగల్రాజపురం గుహల్ని. సముద్రం నిద్రలో ఉన్నపుడు గెల్చాడు ఆహబ్ తనకు తాను.

ఎండలో ఈది అడవుల చాట చెవుల నీడల్ని గెంతి భద్రాచల రావుణ్ణి చూచుకొని ఆలయ ప్రాంగణంలో ఉన్న నెలకు మూడొందల రూపాయిల ఉద్యోగం చేసే ద్వారపాలికను డి వై ఎస్ పి రామచంద్రయ్య, లాయర్ నారాయణల్తో దర్శించుకుని

విషాద వ్యామోహం
భ్రాంతిమయత
కల్లోల దార్శనిక స్థితి
గాజు కెరటాల వెన్నెల గోదారి ఎండిన ఎముకలు
వైక్లబ్యంలోకి ప్రాకిపోయే ఉత్తేజం
అంతర్ముఖీనత
రహస్య వాదం
సాంకేతిక ధ్వని వాదం
విషాద గాంభీర్యం
మధ్యాహ్నపు టీసుకలో మెరసిన మలినాశ్రు బిందువు

దర్శించుకొని పర్ణశాలలో ఉన్న దీర్ఘవృక్షం మర్రిచెట్టు గీతల నీడల్లో కాళ్లూ చేతులూ బార్లాజాపి కళ్ళు నిద్రించి గోదారి ఇసుక పొరలమీద గవ్వల్ని ఏరుకొని

చీకటడే సమయానికి ఆకాశానికి భయపడి గోదారీని సెలవడిగి సిమెంట్ రోడ్డమ్మట మళ్ళీ జీపేసుకొని దారిలో ఎవరో చీట్ల పేకాడుతూంటే వాళ్ళ మీద దాష్టీకంచేసి బస్సొకటి జారి జార్చున్న జనాన్ని మోసుకెళ్తూంటే దాన్ని పట్టుకొని సాక్షి సంతకం చేయనని మొరాయించిన వాడ్ని మొలతాడుచ్చుకుని కొత్తగూడెం లాక్కొచ్చి

బహిరంగ ప్రదేశంలో మూత్ర విసర్జన చేసినందుకుగాను వాడి మీద కేసు పెట్టినా

కూడ
అట్లాంటిక్ మహాసముద్రం అదేమిటని అడగదు,
భద్రాద్రి రాముడు ఏ తానీషా కలలో కన్పించడు,
అధికార తృప్తులమై కొత్తగూడెం చేరుకొంటాం.
ఈ దేశమే ఒక బహిర్ స్థలం
ప్రతి వాడూ అంతర్యుద్ధంలో మూత్ర విసర్జన చేస్తున్నాడు.

* * * *

విమెన్ ఎట్ వార్ సినిమా. ఒకే సమయంలో ఎన్నో ఎన్నెన్నో అన్నీ అన్నన్నీ జరుగుతూంటాయి.

ఒక వేపున హిట్లర్ గెలుస్తుంటాడు. అయినా వాడి మీసాలు కుంచించుకు పోతాయి.

మరో వేపున కాతరీనా బాహు మూలాల్లో రోమాలు సుదీర్ఘ మవుతూంటాయి.

రష్యన్లు గెలుస్తారేమోననే ఆశా పుట్టుకొస్తుంది ప్రసవ వేదనతో. ప్రేగ్‌లో ఉండటం, మూడువందల ఏళ్ళ ఆస్ట్రియా పరిపాలన తర్వాత మళ్ళీ ప్రేగ్‌లోనే ఉండటం చెక్ భాష నేర్చుకొంటున్నంత కష్టం.

“డాక్టర్ సెల్‌మన్! నీ కూతుర్ని దొరికిన పాళంగా కాల్చేయ మంటావా చెప్పు.”

పాపం తండ్రి కళ్ళఅద్దాలమీద ప్రాకుతుంది కన్నీటి క్రీనీడ.

“హోటల్ పారిస్, రూం నంబర్ 402. వస్తావా రావా?”

రావా?

“ఒ గంటైనాక ఉంకో షాంపేన్ తెచ్చిపెట్టు.”

షాంపేనూ పగిలింది తలా పగిలింది.

పావెల్‌కివేసిన పదేళ్ళశిక్ష అపుడే పడింది. ఒకే సమయంలో ఎన్నో ఎన్నో ఎన్నెన్నో అన్నన్నీ జరుగుతూన్నట్లు.

‘నీకోసం కమ్యూనిస్టు మానిఫెస్టో చదువుకున్నాను. నీకోసమని ముగ్గురు శిశువుల్ని తొడల సందుల్లో నొక్కి చంపాను. నీకోసమని నేను జర్మన్‌నని చెప్పుకున్నాను. నీకోసమని మనిషినని.’’

అన్నీ బద్దలయిన ఒకే క్షణంలో నావీపు వెనుక అయిలూలా అయిలూలా సంగీతం - చర్చిలో గంటలు - వెన్నెముక విరిగిన కన్వెన్షన్. సాఫీగా నుంచుంటేగాని పొట్టదిగని విస్కీ-కూర్చుంటే గాని రాని ఒంపులు - కరుణగా ఒక్కొక్క బొట్టూ వీణ గోటి నుంచి రాలుతూ. నుదురంతా స్వేదం - చెప్పు చెప్పు తొందరగా - కాలపు ఇసిక కారిపోతూంది - ఆ అమ్మాయి నరాల్లోకి నరాన్నించి నరంలోకి నరనరాల్లోకి నాళీనరాల్లోకి - నీకోసం కమ్యూనిస్టు మానిఫెస్టో కంఠతా పెట్టిన అమ్మాయి తొడల మూడు శిశువుల చచ్చిన లుంగ చుట్టిన ప్రేగుల్లోకి కాలపు ఇసిక కారిపోతూంది - చెప్పు తొరగా - షాంపేన్ సీసా నీ తలమీద పగిలే లోగా -

శుక్రారంనాడు ఆపెరా. అందాకా ఉండి ఆ సంగీతం మాస్టరుతో - హోటల్ పారిస్ రూం నంబర్ 402 కిరా. వచ్చేసేయ్ వేగిరం - నీ కోసం - ఆపెరా అయిపోయినాక వొచ్చే నీకోసం ఓ షాంపేన్ సీసా అదనంగా అందంగా బుట్టలో అట్టేపెట్టి ఉంచుతా.

పిచ్చికవి నెర్వా గాడినెవరూ దయతలవొద్దు. వాడిపనల్లా క్రిస్మస్ నాడు చాపకడుపు చీల్చి చీలికలో కాఫీ కప్పు పెట్టి ఉడికించి మనందరికీ ఒడ్డిస్తాడు. ఉల్లాయి పదాలు పాడ్తాడు ముఖ్యంగా

కాతరీనా కోసం.
పావెల్ ఏడుపూ అదే
ప్రపంచం ఏడుపూ అదే
విదూషకుడి ఏడుపూ అదే
ప్రపంచమంతా ప్రపంచాన్ని ద్వేషిస్తుంది.

నాసూది మొన చేతికర్రతో నేనుమాత్రం ప్రపంచపటంమీద అన్నిదేశాల నగ్న వక్షస్థలాల మీద పొడిచిపొడిచి మరీ ప్రేమిస్తాను. ఒక్కొక్క దేశం ఒక్కొక్క కుమ్మటానికి వచ్చే రొమ్ము.

నా వీపు వెనక పియానో మెట్ల మీద హిట్లర్.
చెక్ కొలాబరేటర్స్
జర్మన్ నాన్ కొలాబరేటర్స్
చెక్ నాన్ కొలాబరేటర్స్
జర్మన్ కొలాబరేటర్స్

నా తొడల్లో శిశు హత్యలు. నా నాభిముందు ఆఫీసర్స్ బ్రోతెల్. నా పాదాలముందు ప్రొ. డా. సెల్మన్ కళ్ళజోడు కన్నీళ్ళు. నా పిరుదుల వెనుక జఘనాలు. నా చావు కావల మృత్యువు.

అసే వొస్తావా రావా 402 కి?
నీ అక్కకి ఫాక్టరీ రాసేసాను.
నాకది విడాకులిచ్చేస్తుంది.
అన్నీ పోయిన చెక్ గాడికి ఫాక్టరీ ఏంజేసుకోను?
వొచ్చేసేయ్ అసే రావా 402 కి?
నా మృత్యువు షాంపేన్ బుడ్డిలో.

నెర్వాగాడు విషాదామాషక గీతాలు పాడుకుంటూనే ఉంటాడు, వాడి బ్రేసెస్ ఊడిపోతాయ్. వాడి పాడె పట్టీలు తెగిపోతాయ్. దృష్టి ఉన్న వాళ్ళెవరూ పట్టించుకో గూడదు. రొమ్ముల గుండీబాడదీసే దమ్ములు వాడికెటూ లేవు. అందుకే వాడి కళ్ల నీరు గారి పోయి గుండీబాడి పోయి ఒకే క్షణంలో

కాతరీనా బాహు మూలాల్లో రోమాలు రాలిపోయి ఎన్నో!

* * *

అక్షర జ్ఞానం లేకపోతే ఎంత బావుండును ఆ అమెరికన్ హార్మణిపెట్టి జాన్ ఎఫ్ కెనడి ఏర్‌పోర్ట్‌లోని కంప్యూటర్‌లా!

వ్రాత బలిగోరుతుందీ అక్షరం అక్షయమవుతుందీ. కారమ్స్‌బోర్డ్‌ని 'సి ఎ అర్ ఒ ఎమ్ ఎస్' అని రాస్తుంది పాపం మన అంగ్లేయ హార్మోణీపెట్టి. కాని ఆ ఇనాక్యువస్ అమెరికన్ కంప్యూటర్ 'కె ఏ అర్ ఒ ఎమ్ ఎస్' అని గోలపెట్టి "నాయనా నీకారమ్స్ బోర్డ్ నా శబ్దరత్నాకరంలోగాని పదబంధ పారిజాతంలోగాని లోతుగా ఎంత చెయ్యిపెట్టి కెలికినాగాని దొరకటం లేదు ఏం చేమంటావ్ నా బుర్రలోనాటిన తలనీలాల తలపోతల బీజాంకురాలు నీ చావు నీవే చావు నా చావు నేనే చస్తా నస్తమానం నువు తెల్లారేప్పటికి అవసరమయ్యే నేనిచ్చిన బహూకృతి పెట్టిలోంచి పళ్ళు కడుక్కుని గడ్డంగీసుకుని సెంట్‌లూయీస్‌లో నేనిచ్చిన పెర్‌ఫ్యూమ్ రాసుకుని నీ అరవై రూపాయిలకీ నేనిచ్చిన నాలుగైన అరవై డాలర్లు కట్టీ సార్క్ విస్కీ ఎక్కి బియాంకాకో డాలరు టిప్పిచ్చి అందులో మళ్ళీ ఓ అరడాలర్ అప్పుచ్చుకుని హాయిగా నిచ్చెన్ల ఉయ్యాలలూగు" అని తప్పు ఒప్పేసుకుంది కాదా! మరీ దరిద్రపు శబ్ద దారిద్ర్యపు తెలుగు దేశంలో కవులెందుకు కంప్యూటర్లుకారో ఒక్క 'త్రిపుర'కే తెలుస్తుంది. శ్రీశ్రీ కీ తెలుసుగాని తెలియ జెప్పడు.

వచనంలోని ఎక్స్‌పాండెడ్ రియాలిటీని చూపించాలంటే రంగుల్నీ షేప్స్‌నీ, సైజెస్‌నీ, టెక్చర్‌నీ స్పేషియో టెంపొరల్ యాక్సిస్‌లో పిన్నుల్ని గుచ్చుకుంటూ పోవాలి. యుద్ధరంగపు ఆపరేషనల్ మాప్‌లా లొకేషన్స్‌ని గుచ్చుకుంటూ పోవాలి. సినిమాల్ని తీసేప్పుడు ఊటీలో ముఖ్యంగా ఆ పిచ్చిపిల్లల పేర్లమని కిళ్ళీ లేసుకున్న నోళ్ళల్లో పాటల్ని గుచ్చుతున్నప్పుడు లంగా లెగరేసుకు తిరుగుతూ గెంతుతూ క్లోజప్, లాంగ్ షాట్స్‌లో గుచ్చుతున్నపుడు అంచులు, ఆకాశాంచలాల అంచులు అందుతాయి. (వింటున్నారా త్రిపురగారూ మెదడులో రెండు కుమ్మరి పురుగులున్న నన్ను?)

(తెలుగులో) అంచులు
అంచు లంచెలుగా అంచులు
మంచెలమీద అంచులంచులుగా పంచెలు
దుఃఖాల పంచెలమీద అంచులంచులుగా లంగాలు
అంగాలలోలంగాల మలినాంగాలు
(అంగ్లంలో) అంచులు

"ఐ స్ట్రిపెడ్ అపాన్ అ లోత్సమ్ ప్లేస్" (స్టీఫెన్ క్రేన్)

"అబౌవ్ ద న్యూ హెమ్స్ ఆఫ్ ది సీ" (హార్ట్ క్రేన్)

"ఐ స్టాప్ట్ అపాన్ అ లోత్సమ్ స్టేషన్" (స్టీఫెన్ క్రేన్)

"స్టిల్ హియర్ లైయింగ్ బినీత్ ద రూఫ్"
(ఆర్చిబాల్డ్ మక్లీష్)

"అబౌవ్ ద హ్యూమిడ్ హెమ్స్ ఆఫ్ ది సర్ఫ్"
(హార్ట్ క్రేన్)

కరణానికి కంప్యూటర్‌కి వ్యాకరణం అడ్డేమిటి? చూడు చూడు నీడలు కంప్యూటర్ పదాల జాడలు!

మళ్ళీ అంటుంది హార్ట్ క్రేన్, "అబౌవ్ ది ఫ్రెష్ రఫుల్స్ ఆఫ్ ది సర్ఫ్" అని.

నేనూఅంటాను పుదుచ్చేరీ ఒరొబిందో ఆశ్రమ సముద్రంలో ఆయారడుగుల అమ్మాయిలో కూచునో నుంచునో వొంగునో భీష్మి వెండి ఇసుక తడి లాక్షాయణ పాదాల నునువెచ్చని సూర్య స్నాత చుంబనాంచలాల్లోంచో –

మళ్ళీ (తెలుగులో) అంచులు!

"నిష్క్రమించాను నేను నిర్జన నిరానంద నిరామయ కటి ప్రదేశంలో" (స్టీఫెన్ క్రేన్)

"కొత్త చీర చెరగుల వినూత్న సముద్రాంచలాంచలాల"
(హార్ట్ క్రేన్)

"దిగడిపోయాను దిక్కుమాలిన విధి ధూమ శకట క్రాంత స్థానాన" (స్టీఫెన్ క్రేన్)

"ఇంకా ఇక్కడే పగాలుబడి దిగాలుబడిన కప్పుకింద కప్పెప్పలు కప్పడి" (ఆర్చిబాల్డ్ మక్లీష్)

"ఎక్కబోస్తోన్న కవోష్ణ సముద్రోష్ణంచో పరితలాల"
(హార్ట్ క్రేన్)

నా తలనీలాల కంప్యూటర్ కవిత్వోపరిరంభాల దిక్సూచీ సూది మొనల నిలిచిన శూన్యాక్షరాన నిలిచిన నిషిద్ధాక్షర సిలబిల్‌లో బతుకు వెత కార్చిన నెత్తురు పన్నీటి మార్ఫీమ్ విదిల్చిన వీర్యంలో కొన్ని కోట్ల క్రోమోజోమ్స్‌లో

ఇలాంటి జీవన భయానంద అక్షరం
అక్షరం అమీబా. ఏకకణజీవి అవునా నగ్న నీశ్వరా
అవునా స్మైల్ నువు సంతకం చేసిన
వేళ్ళల్లోంచి తొలగిన జారిన చిర్నగవు

"అండ్ ఫ్రమ్ ది సీక్రెట్ స్పేస్ ఆఫ్ ది సిగ్నేచర్
ది స్మైల్ స్ప్రాపెడ్ అప్, ట్రాన్స్‌లేటింగ్ టు ది స్టాంప్
త్రీ-పాయింటెడ్ సైన్ ఆఫ్ స్పార్క్ అండ్ స్పార్క్"
(డైలాన్ థామస్)

అపునా 'అజంతా'గారూ
అక్షరానికి క్షయ వ్యాధి
'జానా మీరాఖాన్‌గారూ'
మీరా వేష్టికి
త్రికాలాలా మూడువేళ్ళ త్రిశూలంలోంచి
అజంతాగారి 'క్షుద్ర సంధ్య'న
సంధ్య వారుస్తోంటారు
మోహన ప్రసాదొచ్చి
విస్కీ ఉడికిందా అనడుగుతోంటాడు.

* * *

నాన్న మామయ్య మహానుభావుడు
నను కన్న నాన్న
నను పెంచిన మామయ్య
మహానుభావుడు పోతన మామయ్య
నను కడుపులో పెట్టుకు పెంచిన
పోతన మామయ్య మహానుభావుడు
నన్నిలా గొప్పకోసం కీర్తికోసం నువు పల్లకిలో
మోసుకొచ్చిన వజ్రాలహారం కోసం నీ మదకరేంద్రములకోసం
నన్నిలా పలుపుపెట్టి లాక్కెళ్ళొద్దు నాన్నా
నా స్నేహప్రియుడు కౌమార హాలికుడు తన నాగళ్ళను విచిత్రాతి
విచిత్రంగ ఫారిన్ కరెన్సీమీద మహా తొందరగా దొరికే డాలర్ల
ఫోర్డ్ ట్రాక్టరులా మన్నించగలడు నీ పల్లకీ అదేనా నాన్నా నను
అంపించాల్సిన
శక్ర చాప మధువక్రరేఖ పల్లకీ
ఓహోం ఓహోం బోయీల పల్లకీ ఆగిపోయినపుడు గాలిలో తేలి
పోయినపుడు తన నాగళ్ళను గాలితొందర పెట్టినట్లు వేగిర పెట్టినట్లు
కర్షక కవి అవుతాడు నాన్నా
కృషీ వలుడవుతాడు నాన్నా
ఒద్దు నాన్నా నువు తెచ్చిన పట్టుపంచెలు మళ్ళీ పల్లకీమీద తిరిగి
మోయు భారంతో తీసికెల్లాల్సి ఒచ్చినపుడు
నా కడుపులో ఏవో దేవుతుంది నాన్నా
నగుమోము నాగయ్యలో
ఈ ప్రపంచం ఈ సంచలనచిత్రాలూ చచ్చిపోతే ఎంత బావుండును!

కడుపులో శ్వాసకోశాల్లో హృదయంలో ఏదో దేవినట్లవటం ఎవరు ఏ డాక్టరుగారు చెప్తారు నాకు డా. మధుసూదనరావుగారు తప్పితే

నాడీమండలంలో ఏ జ్యోతిషరేఖ దొరుకుతుందో పాపం ప్రకృతి ఆశ్రమ డాక్టరు శర్మగారికి గోళ్ళల్లో ఏ అంతర్గోళాల వ్యాధి ఆదులు దృగ్గోచరమవుతాయోగాని వీళ్ళందరికీ జీవితంమీద ఇంత ప్రేమ బతకమని శాసించమని శ్వాసించమని ప్రేమమీద ఇంత ప్రేమ శ్వాసించమని శపిస్తారు ప్రాణాలు తోడేస్తారుచూపుడు వేలు మీద ఓ చిన్న హత్య చేసే మూత్రం మచ్చుకో చుక్కని నాలుకమీద వేసుకొని రుచి రంగు వాసనా చూచి వ్యాధి గ్రస్థుడిలో ఏ పురాజన్మ వాసనలున్నాయోనని అనుమానించి అవమానించి కళ్ళ ముక్కలు ముక్కలుగా కోసుకొని ఉల్లిపొర లాంటి అద్దంలోంచి వంద అంకెలదాకా ప్రపంచమంతా ప్రతిబింబితం చేసినా కూడా

నాన్న మామయ్య మహానుభావుడు
రక్తంలో మూత్రంలో స్వేదంలో మలంలో
ఒక్క ప్రేమ తక్క ఏమీ లేనివాడు
ఊరికేనే ఏడుస్తాడు
ఆ కలనీ దాహమనీ ఆ మొహంలో
ఎప్పుడూ ఏమీ అనిపించదు
ఆ కళ్ళు ఈ నికృష్ట దారిద్ర్యాన్ని చూడవు
ఏ మహద్గోళాల వెల్తురులోని ఎటో
అదే చూపు అదే పోత ఆ కళ్ళు
ఆఖరి క్షణంలో నయినా రారా అని చూస్తోన్న చూపు
చీకట్లోంచి చిట్లినట్లున్న ఆ నయనాలు

ఎప్పుడూ ఆ సజల నేత్రాల దీపాల వెల్తుర్లో నేను నాన్ననన్ని ప్రేమలోంచి వెల్తురులోంచి కాంతిలోంచి దివ్వెలు వెలారిన ఆ దుఃఖ దురిత లోకాల్లోకి లాక్కెళ్ళొద్దు నాన్నా

నీ కాళ్ళకు మొక్కుతాను నాన్నా
నా కన్నీళ్ళు చూడు తండ్రీ

నీ దుఃఖం నాకు తెలుసు నీ దుఃఖం నీది లోకానిది కాదు సమస్త లోకాల్నీ ఆవాహన చేస్తున్నాడు మామయ్య పోతన మామయ్య కోసం దేవతలు వొచ్చి అత్మలో ఆకలిలేని బ్రాహ్మల కోసం మాలిన్యంలేని దేహాల్ని స్నానించి వొచ్చిన బ్రాహ్మలకోసం గుండిగలు కాగులు నిండా పాయసాలు పరవాన్నాలు వొండి ఒడ్డిస్తారు తాటాకు విసినకర్రలూ తెస్తారు. విద్యుత్పంకాలు తేలేరుగానీ నాన్నా కనపడని విమానాల్లో తలకిందులైన జలబిందువుల్లా వొస్తారు నాన్నా నామీద ఇంత ప్రేమ ఉండే వాళ్ళనీ ప్రకృతి ప్రేమనీ నేలతల్లి ఒడిలోని దయనీ నీ ఒక్క సీస పద్యంలోనయినా చూడలేవా నాన్నా.

కని పెంచిన ప్రేమ
కన్పించిన ప్రేమ
వెదుక్కున్న ప్రేమ
కాళ్ళకి చుట్టుకు పోయిన తీగ
పెంచుకున్న ఐవీ క్రీపర్

అంతా ఒకటే నాన్నా ఒకటే మమత నాన్నా ఎక్కడో ఎందుకో గాని పారేసుకున్న ఎవరికో ఎప్పుడో ఏ ఒకరికోగాని దొరకని మాధవీలత మాలతీ చంద్రిక నీ రాచ కవిత నీ శృంగార కవిత విన్పించకు

పల్లకీ గుచ్చకు
ఫర్మానా విప్పకు

నను అగరు దీప ధూప కాంతిలో చూస్తే నక్షత్రాలు మంచు కన్నీళ్లు కారుస్తయ్ నాముక్కెరమీంచి రాగజలధిలోకి రత్నాలయి

ఇప్పటికే ఈ ప్రపంచం కన్నతల్లుల్లేని ప్రపంచం పెళ్ళి కాని తల్లుల వేశ్యల వీధి పాలకోసం ఏడుస్తోన్న ఫాక్టరీ గళం నీళ్ళ సమాధిలో మునిగి తేలిన నిష్కారణ నిర్మోహ శవం తకధిమి తకధిమి తోల్బొమ్మల కీలు విరిగిన దారం పేకువలోకి దూసు కొచ్చిన అమవస నిశి ఈవ్ క్లిటారిస్‌ని నముల్తోన్న కొండచిలువ సదా వెన్నెలవెల్లువల్లో అదే పనిగా తరుముతున్న. 302 బోర్‌గన్ క్రిమికీటకాల నాలుకల్లో పాచిని కూడ నాకే లారీల ఫైనాన్సియర్ల ఐదురూపాయిల వొడ్డీల మంగళసూత్రాల ఇరవై సూత్రాలసంస్కృతి సారాకి నోరుతెరిచేఎన్నికలల స్టీలుబిందెలనిండా పంచదారలపరదారల విలువ ఎర్ర చొక్కాల ఎర్ర చీరల సముద్రాల్ని మరింత ఎరుపు చేసే రక్త దాహ రైఫిళ్ళ బాయొనెట్ల సామూహికహత్యాకాండ పోలియో పసిపిల్లల పక్షవాతాల్ని నరనరానా కోసివేసే పసిపువ్వులా మొగ్గ తొడిగిన అనేకానేక బాలికల నును స్వప్నలోకాల్ని పటాకారుల దంతాల్తో కొరికేసే రౌడీ మూకల రాజ్యం కళ్ళువెల్తురు చూచే పెళ్ళాం, పిల్లల ముందు భాగల్పూర్ అంధ విభ్రాంతుల వినిర్మల నిశ్చల చిత్రాల కసాయిశాల హాయిగా ఎగుర్తోన్న పక్షి రెక్కని ఎఫ్ 16 తో కొట్టే క్రూర నైశిత్యం మృదు ధ్వని మధురలోకాల్లోంచి వీస్తోన్నా కళ్ళ కిటికీల్ని టపీ మని నుదురు చిప్పల్లు మూసేసే శ్రవణ దారిద్ర్యం

నాన్నా మామయ్య మహాను భావుడు
నను కన్న నాన్నా నను పెంచిన మామయ్య
పోతన మామయ్య మహాను భావుడు

ఒక చిర్నగవు కళిక ఈ తమస్సు నంతా మాయగా లీలగా క్రీడగా గప్పున హారతి కర్పూరంలా వెలిగిస్తుంది అక్షరాక్షరానా తన తపస్సు నూనెని కాల్చుకుంటూ

ఇలా ఏడుపులోంచి కన్నీళ్ళలోకి
చూపుడు వేలులోంచి నెత్తురు చుక్కలోకి
ఎక్స్‌రే ఫొటోలో చిక్కుపోయిన ఎముకల్లోంచి
ఈ లోకపు అరక్త హృదయనాళాల్లోంచి

శ్వాసకోశాలు చీల్చుకొని అడుగుతున్నాను నాన్నా నాకీ ప్రకృతే బావుంది సర్వప్రాణాల్ని కాపాడే ఈ నిసర్గ ప్రకృతే బావుంది నను లాక్కెళ్ళొద్దు నాన్నా పలుపుల్తో పల్లకీల్తో

ఈ ఆకాశమే బావుందని ఏడుస్తోంది నాన్నా
నను కన్న ఓ నాన్నా నాన్నా నాన్నా
అమ్మ కోసమైనా నో నాన్నా!